క్లుప్తంగా

నేడు అర్కటవేములలో కల్యాణం


రుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి

రాజుపాళెం : అర్కటవేముల గ్రామంలోని శ్రీ మదన గోపాలస్వామి ఆలయ ఆవరణంలో గురువారం రుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణు గోపాల స్వామి కల్యాణాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ వంశ పారంపర్య అర్చకులు క్రిష్ణపాటి వెంకయ్య స్వామి కుమారుడు నంద కిషోర్ తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు కల్యాణం, 12 గంటలకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని చెప్పారు. సాయంత్రం స్వామి వారి గ్రామోత్సవం, కోలాటం కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ కల్యాణోత్సవానికి గ్రామంలోని ప్రజలు, మహిళలే కాక చుట్టుపక్కల గ్రామాల వారు కూడా రావాలని ఆయన కోరారు.

రేపు అష్టలక్ష్మీ వ్రతం

ప్రొద్దుటూరు : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలోని కాలక్షేప మండపంలో ఈనెల 8న శ్రావణ శుక్రవారం సందర్భంగా ఉదయం 9 గంటలకు అష్టలక్ష్మీ వ్రతం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, ఈఓ శంకర్ బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. అష్టలక్ష్మీదేవిల వ్రతం 108 ముత్తయిదువులతో ఘనంగా నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. వ్రతంలో పాల్గొనేవారు ముందుగా తమ పేర్లను ఆలయ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని కోరారు.

సోమాపురంలో కంటి అద్దాలు పంపిణీ


సోమాపురంలో కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

చాపాడు : మండల పరిధిలోని సోమాపురం గ్రామంలో వైఎస్సార్ అవ్వతాతల కంటి వెలుగు పథకం క్రింద బుధవారం అవ్వతాతలకు కంటి అద్దాలు పంపిణీ చేసినట్లు ఆప్తాలమిక్ అసిస్టెంటు తేజ తెలిపారు. ఇటీవల గ్రామాల్లో కంటి వైద్య శిబిరాలు నిర్వహించి అక్కడ జరిపిన పరీక్షల్లో కంటి అద్దాలు అవసరమైన వారికి పంపిణీ చేస్తున్నామన్నారు. మళ్లీ త్వరలోనే గ్రామ సచివాలయాల పరిధిలో కంటి వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎం కుమారి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉదయనిధి స్టాలిన్‌పై తిరగబడాలి

పోరుమామిళ్ల : సనాతన ధర్మాన్ని నాశనం చేయాలని సంకల్పించిన తమిళనాడు ముఖ్యమంత్రి కుమారుడు ఉదయనిధి స్టాలిన్‌పై యావత్ హిందూ సమాజం తిరగబడాలని బీజేపీ బద్వేలు అసెంబ్లీ ఇన్‌చార్జి ఉట్టి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. బుధవారం ఆయన మాట్లాడుతూ హిందూ దేవుళ్లపై, హిందూ సమాజంపై, హిందూ సంస్కృతి, సంప్రదాయాలపై ప్రతివాడు విమర్శించడం, నోటికి వచ్చినట్లు మాట్లాడటం ఫ్యాషన్ అయిందన్నారు. హిందూ సమాజం మొద్దు నిద్ర నుంచి లేవకపోతే భవిష్యత్తులో అనేక పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందన్నారు. రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు ఉదయనిధి భావజాలాన్ని ఖండించాలన్నారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు పల్లెంశెట్టి పండరి, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం

చాపాడు : మండల పరిధిలోని ఖాదర్‌పల్లె, చియ్యపాడు గ్రామాలలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు శ్రీవాణి తెలిపారు. గ్రామంలో 104 వాహనం ద్వారా నిర్వహించే వైద్య శిబిరంలో అన్ని రకాలైన వైద్య నిర్వహించి, మందులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అవకాశాన్ని ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి కోరారు.

కృష్ణం వందే జగద్గురుం

- భక్తి శ్రద్ధలతో కృష్ణాష్టమి వేడుకలు
- పలు పాఠశాలల్లో ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణలు


శ్రీకృష్ణమందిరంలో ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న స్వామివారు


గురురాఘవేంద్ర పాఠశాలలో శ్రీకృష్ణుడి వేషధారణలో చిన్నారులు

బద్వేలు అర్బన్ : కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పలు కృష్ణమందిరాలలో బుధవారం భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక నెల్లూరురోడ్డులోని శ్రీకృష్ణ మందిరం, గాండ్లవీధిలోని గోపాలస్వామి ఆలయం, సిద్దవటం రోడ్డులోని అనంతగిరి క్షేత్రం శ్రీకృష్ణ మందిరాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నెల్లూరు రోడ్డులోని శ్రీకృష్ణ మందిరంలో స్వామి వారికి పంచామృతాభిషేకం, సహస్ర నామార్చన, గోపూజలతో పాటు శాంతిహోమం నిర్వహించారు. అలాగే అనంతగిరి క్షేత్రం శ్రీకృష్ణ మందిరంలో అభిషేకం, గీతాపారాయణం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్ద, ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం చిన్నారులు వేసిన చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణలు అలరించాయి.

ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

ప్రొద్దుటూరు కల్చరల్ : శ్రీ కృష్ణాష్టమి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని పలు విద్యాసంస్థల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక గిడ్డంగి వీధిలోని గురురాఘవేంద్ర పాఠశాలలో కృష్ణాష్టమి సందర్భంగా విద్యార్థుల వేషధారణలు అందరిని ఆకట్టుకున్నాయి. ఉట్టికొట్టు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. శ్రీకృష్ణజన్మాష్టమి విశిష్టతను పాఠశాల డైరెక్టర్ రెడ్డెయ్య వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది ఉమామహేష్, ప్రభాకర్, సుధారాణి, చందన తదితరులు పాల్గొన్నారు. అలాగే శ్రీ కృష్ణ గీతాశ్రమంలోని శ్రీవేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో శ్రీకృష్ణాష్టమి సందర్భంగా నిర్వహించిన ఉట్టి కొట్టు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కరస్పాండెంట్ హరినారాయణ, ప్రిన్సిపాల్ ముస్తఫా, కో ఆర్డినేటర్ గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు

నేడు ఇస్కాన్ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి

స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో గురువారం సాయంత్రం ఇస్కాన్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. భారీ మండపం ఏర్పాటు చేశారు. 30 వేల మంది భక్తులకు అన్న ప్రసాదంతో పాటు వెన్న లడ్డూను అందజేయనున్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఎలాంటి ఇబ్బంది కలుగ కుండా 500 మందికిపైగా ఇస్కాన్ బృందం, వలంటీర్లు, భక్తులు, ఎన్‌సీసీ క్యాడెట్లు సేవలందించనున్నారు. సాయంత్రం 4.30 నుంచి పూజాకార్యక్రమాలు ప్రారంభమవుతాయని నిర్వాహకులు తెలిపారు. అలాగే ఇస్కాన్ కృష్ణ మందిరంలో శ్రీకృష్ణబలరాములకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. కృష్ణమందిరాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు.

యదువంశ వృక్షం కువైట్ సంస్థ ఆధ్వర్యంలో..

ప్రొద్దుటూరు : స్థానిక గాంధీ రోడ్డులోని సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్‌లో యదువంశ వృక్షం కువైట్ ఆధ్వర్యంలో బుధవారం శ్రీకృష్ణమి వేడుకలను నిర్వహించారు. చిన్నారులతో గోపిక, శ్రీకృష్ణుడు వేషధారణలు వేయించారు. సంస్థ ఆధ్వర్యంలో కువైట్‌లో ఈనెల 8న ఒమేరియా పార్క్‌లో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు వికసిత ఫౌండేషన్ చైర్‌పర్సన్ శూలం లక్ష్మీదేవి తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐ యనమల సిద్ధార్థ యాదవ్, చిన్న పిల్లల వైద్యుడు పవన్ యాదవ్ గొర్ల, దేవిక సావిత్రి, రమ్య, పామిడి వీరయ్య యాదవ్, హరి పాల్గొన్నారు.


శ్రీకృష్ణాష్టమి వేడుకలను నిర్వహిస్తున్న దృశ్యం


అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పందిరి

స్మార్ట్ స్ట్రీట్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు : స్థానిక మైదుకూరు రోడ్డులో పుట్టపర్తి సర్కిల్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు జరుగుతున్న స్మార్ట్ స్ట్రీట్ పనులను బుధవారం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పరిశీలించారు. తొలివిడతగా రూ.1.83 కోట్లతో పనులు చేపడుతున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులను త్వరగా పూర్తి చేయాలని సిబ్బందికి ఎమ్మెల్యే సూచించారు. పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌సీపీ మెంబర్ కాకర్ల నాగేశ్వరరెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.


స్మార్ట్ స్ట్రీట్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

భగవద్గీత పఠనంతో విద్యార్థులకు నైతిక విలువలు

బద్వేలు అర్బన్ : విద్యార్థులు చిన్నతనం నుంచే భగవద్గీత పఠనం చేయడం ద్వారా వారిలో నైతిక విలువలు పెంపొందుతాయని సర్వశిక్షాభియాన్ పీడీ డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. కృష్ణాష్టమి సందర్భంగా రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక తెలుగుగంగకాలనీలోని సమితి ఆశ్రమంలో బుధవారం విద్యార్థులకు భగవద్గీతపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మొదటి బహుమతి నిఖిత, రెండవ బహుమతి ఉషశ్రీ, మూడవ బహుమతి పూజితలు కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో బద్వేలు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రావు, రిటైర్డ్ ఎంఈఓ రామసుబ్బయ్య, రామకృష్ణ సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్ఎస్ఏ పీడీ డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి

నిరుపయోగంగా పర్యాటకశాఖ విశ్రాంతి భవనం

బ్రహ్మంగారిమఠం : ప్రముఖ పుణ్యక్షేత్రం మండల కేంద్రమైన బ్రహ్మంగారిమఠంలో పర్యాటక శాఖ విశ్రాంతి భవనం శిథిలావస్థకు చేరింది. ఒకప్పుడు పర్యాటకులతో కళకళలాడినన ఈ విశ్రాంతి భవనం శిథిలావస్థకు చేరుకున్నా పర్యాటక శాఖ అధికారులు పట్టించుకోవడంలేదని స్థానికులు అంటున్నారు. వీరబ్రహ్మేంద్రస్వామిని దర్శించుకొనేందుకు వచ్చిన భక్తులకు పర్యాటక విశ్రాంతి భవనం ఎంతగానో ఉపయోగకరంగా ఉండేది. 200లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పర్యాటక కేంద్రాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడంతో బి.మఠంలో అప్పటికే ఉన్న విశ్రాంతి భవనానికి ప్రత్యేక నిధులు కేటాయించి నూతనంగా రూపు దిద్దారు. మూడు డబుల్ బెడ్ రూములు, పెద్ద కామన్‌హాల్, కిచెన్, సమావేశ మందిరం, విశాలమైన ప్రదేశం, వాహన పార్కు వంటివి ఉన్నాయి. అప్పట్లో రాజకీయ నాయకులు కూడా ఇక్కడనే సభలు, సమావేశాలు, నిర్వహించుకునేవారు. ఇక్కడ ఇద్దరు వాచ్‌మన్లు, వంట మనిషి ఉండేవారు. పర్యాటకులు కూడా ఎక్కువగా వచ్చేవారు. అందుకు తగ్గటుగా ఆదాయం వచ్చేది. గత 10 సంవత్సరాలుగా పర్యాటక శాఖ అధికారులు పట్టించుకోక పోవడంతో సిబ్బంది లేక ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుంది. బి.మఠంలో యాత్రికుల కోసం సరైన విశ్రాంతి భవనాలు లేక ఇబ్బందులు పడక తప్పడంలేదు. దేవస్థానం పరిధిలో ఉన్నవి చిన్న చిన్న గదులు కల్గిన కాటేజీలు ఉడడంతో భక్తులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా పర్యాటకశాఖ అధికారులు విశ్రాంతి భవనానికి మరమ్మతులు చేయించి పర్యాటకులకు అందుబాటులోకి తేవాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.


శిథిలావస్థలో ఉన్న పర్యాటక శాఖ విశ్రాంతి భవనం

రేపటినుంచి విగ్రహప్రతిష్ట వేడుకలు

పోరుమామిళ్ల : రంగసముద్రం పంచాయతీ రెడ్డినగర్‌లో నిర్మించిన నూతన దేవస్థానంలో నెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు వరసిద్ధి వినాయక, శ్రీకోదండరామస్వామి నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు జరుగుతాయని సర్పంచ్ చిత్తా రవిప్రకాష్ రెడ్డి తెలిపారు. శుక్రవారం విశ్వక్సేన ఆరాధన, మహాగణపతిపూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, మృత్సంగ్రహణము, జలాధివాసం ఉంటుందన్నారు. శనివారం మహాకుంభ స్థాపన, మూలవిరాట్‌ల గ్రామోత్సవంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలుంటాయన్నారు. ఆదివారం శిఖర, కలశ, ధ్వజస్తంభ, నాగుల ప్రతిష్ట కార్యక్రమాలు, శ్రీ సీతారామ తిరు కల్యాణం, అనంతరం అన్నదానం, సాయంత్రం గ్రామోత్సవం జరుగుతుందన్నారు.


నూతన దేవస్థానం

పావని లక్ష్యసాధన స్ఫూర్తిదాయకం

మైదుకూరు : మైదుకూరుకు చెందిన భూమి రెడ్డి పావని డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికయ్యేందుకు చేసిన లక్ష్యసాధన స్ఫూర్తిదాయకమని పులివెందులకు చెందిన జీవీ ఆర్ ఫౌండేషన్, జీవీఆర్ ఉచిత బలిజ మ్యాట్రిమోని వ్యవస్థాపకులు జీవీ రమణ అన్నారు. బుధవారం ఆయన ఇటీవల గ్రూప్‌–1 పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో 2వ ర్యాంకు సాధించి డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైన భూమిరెడ్డి పావనిని ఆమె స్వగృహంలో కలిసి అభినందించారు. పావని గ్రూప్‌–1 పరీక్షల సన్నద్ధమైన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తన కుమార్తె ఉన్నత లక్ష్యానికి చేరుకునే విధంగా ప్రోత్సహించిన తల్లిదండ్రులు భూమిరెడ్డి గంగయ్య, లక్ష్మీదేవితోపాటు పావనిని శాలువా, పూలమాలతో సత్కరించారు. భవిష్యత్తులో ఆమె మరింత ఉన్నత స్థానానికి చేరుకోవాలని జీవీ రమణ ఆకాంక్షించారు. పావనిని అభినందించిన వారిలో లక్ష్మయ్య, జి.రామకృష్ణ ఉన్నారు.


పావనిని అభినందిస్తున్న జీవీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు జీవీ రమణ

ఐటీ నోటీసులపై చంద్రబాబు నోరు విప్పాలి

కడప కార్పొరేషన్ : ఐటీ శాఖ ఇచ్చిన నోటీసులపై టీడీపీ నేత చంద్రబాబు నోరు విప్పాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు అప్పుడు సీఎంగా ఉన్న చంద్రబాబు ప్రతి అంశంలోనూ వేల కోట్లు కమీషన్లు తీసుకున్నారని, ఆ పార్టీ నేతలు కూడా దోచుకోవడం, దాచుకోవడమే పనిగా చేసుకున్నారన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో బాబు రూ.118 కోట్లు కమీషన్లుగా తీసుకున్నారని ఐటీ శాఖ రుజువులతో సహా బయటపెట్టిందన్నారు. దీనిపై వివరణ ఇవ్వాల్సిన చంద్రబాబు తేలు కుట్టిన దొంగలా నోరు మెదపడం లేదని విమర్శించారు.

బాబు అక్రమార్జనలో ఇదొక భాగం మాత్రమేనని, ఇలాంటి ఎన్నో స్కాములు ఆయన చేశారని తెహల్కా డాట్ కాం ఎప్పుడో బయటపెట్టిందని గుర్తు చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్‌లో తండ్రీ తనయులు చేసిన అవినీతిపై సీబీఐతో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. రహస్య కోడ్‌లు ఉపయోగించి వందల కోట్ల ప్రజాధనాన్ని వీరు లూటీ చేశారన్నారు. చంద్రబాబు జీవితమంతా ఆర్థిక నేరాలు, కుట్రలు, కుతంత్రాలతోనే సాగిందని, ఆయన ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో నిత్య, ఫయాజ్ పాల్గొన్నారు.

మంత్రి వ్యాఖ్యలు సరికాదు

పోరుమామిళ్ల : గురువు కన్నా గూగుల్ మిన్న అంటూ సీనియర్ మంత్రి ఆదిమూలపు సురేష్ చేసిన వ్యాఖ్యలు సరికాదని, సాంకేతిక పరిజ్ఞానం ఎంత అభివృద్ధి చెందినా ఏపీ గురువులకు సాటి కావని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పి.రమణారెడ్డి అన్నారు. బుధవారం ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గూగుల్‌కు కూడా కంటెంట్ అందించేది గురువులే అన్న సంగతి గమనించాలన్నారు. ప్రభుత్వ పెద్దలు ఆలోచించి ఉపాధ్యాయుల పట్ల చేసిన వ్యాఖ్యలు వెనక్కు తీసుకోవాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర కమిటీ కన్వీనర్ చంద్రశేఖర్, రీజనల్ కన్వీనర్ పుల్లయ్య, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శేఖర్‌బాబు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు

అట్లూరు : మండలంలోని కమలకూరు గ్రామంలో రుక్మిణీ సమేత వేణుగోపాల స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం ప్రాతఃకాలపూజ, అవాహిత దేవతా హోమము, గణపతి, రుద్ర, చండీ హోమములు, కలశ స్థాపన, ధ్వజస్తంభ ప్రతిష్ట పూజా కార్యక్రమాలను వేదపండితులు బ్రహ్మశ్రీ లక్ష్మీనరసయ్య, బ్రహ్మశ్రీ సుబ్బరామశర్మ, బ్రహ్మశ్రీ శంకరశర్మలు నిర్వహించారు. ఉదయం 10 గంటలకు గ్రామోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులకు అన్నదానం నిర్వహించారు.


రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

ప్రొద్దుటూరు : రాష్ట్రంలో ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ తెలిపారు. బుధవారం పట్టణంలోని తమ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రెండు కోట్ల ఉద్యోగాలను ఇస్తామని చెప్పారని, ఇప్పటి వరకు ఎన్ని కోట్లు ఉద్యోగాలు ఇచ్చారని ప్రశ్నించారు. ప్రైవేటీకరణ పేరుతో ప్రభుత్వ రంగ సంస్థలను అదాని, అంబానిలకు దోచిపెడుతున్నారని విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా ప్రజల నోట్లో మట్టి కొట్టారన్నారు. సమావేశంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్ రాజ్ పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

కాశినాయన : మండలంలోని గొంటువారిపల్లెలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పాల్గొంటారని స్థానిక సర్పంచ్ పిచ్చిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొనాలని ఆయన కోరారు.

రేపు నగరంలో నిరసన ర్యాలీ

కడప కల్చరల్ : తమిళనాడుకు చెందిన రాజకీయవేత్త ఉదయనిధి స్టాలిన్ భారతీయ సనాతన ధర్మానికి వ్యతిరేఖంగా చేసి వ్యాఖ్యలకు నిరసనగా విశ్వ హిందూ పరిషత్, హిందూ చైత న్య వేదికలు నిరసన ర్యాలీలు చేపట్టనున్నట్లు సంస్థల ప్రతినిధులు బెస్తవేముల రామమ హేష్ తెలిపారు. శుక్రవారం ఉదయం 9.30 గంటలకు ఆర్టీసీ బస్టాండు వద్దగల అంబేద్కర్ సర్కిల్ నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందని తె లిపారు. ర్యాలీ కలెక్టరేట్‌కు చేరుకున్న తర్వాత సంస్థల ప్రతినిధులు తమ నిరసనను తెలిపే వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేస్తామని తెలిపారు.

గురువులందరికీ క్షమాపణ చెప్పాలి

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయులను కించపరిచేలా మాట్లాడిన పురపాలకశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ తక్షణం ఉపాధ్యాయులకు క్షమాపణ చెప్పాల ని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి డిమాండ్ చేశారు. గతంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన ఆయన ఈ వాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. అలాగే యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆయన ఉపాధ్యాయలోకానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

నేడు ఆత్మీయ కృతజ్ఞత సభ

పెండ్లిమర్రి : పెండ్లిమర్రి మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, జేసీఎస్ కన్వీనర్లు, గృహసారధులు, వలంటీర్లకు గురువారం ఉదయం 9గంటలకు కడప నగర సమీపంలోని ఫాతిమా కళాశాల వద్ద ఉన్న మహాలక్ష్మి కల్యాణ మండపంలో ఆత్మీయ కృతజ్ఞత సభ నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పెండ్లిమర్రి మండలంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం దిగ్విజయంగా పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ సభ నిర్వహిస్తున్నామన్నారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి హాజరవుతారన్నారు.

రేపు సీతారాంపల్లె గంగమ్మ తల్లి ప్రథమ వార్షికోత్సవం



వేంపల్లె : చక్రాయపేట మండలంలోని సీతారాంపల్లె గ్రామంలో 8వతేదీ శుక్రవారం గంగమ్మ తల్లి దేవస్థానం ప్రథమ వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు సీతారాంపల్లె గ్రామ ప్రజలు తెలిపారు. ఈ సందర్భంగా గణపతి పూజ, విశేష అభిషేకం, అలంకారం, తదితర పూజాకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు.